క్లుప్తంగా

పశు ఆరోగ్య సురక్ష

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లె పంచాయతీ మల్లాలమ్మ దిన్నె ఎస్టీ కాలనీలో గురువారం పశు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాలు మోహనమ్మ హాజరుకాగా, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, గుర్రప్ప డీసీసీ బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పశువులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకంగా వారి ఇంటివద్దకు వచ్చి పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పశువులకు పరీక్షించి కావాల్సిన మందులను అందజేశారు. శిబిరంలో డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ రాజశేఖర్, పశువైద్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

చిన్నమండెం : ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్‌ను విధిగా ధరించాలని చిన్నమండెం ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలో వాహనదారులకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్‌ఐ అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా మాధవి



మాధవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన పల్లె మాధవి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైంది. ఈ సందర్భంగా రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు మాధవికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, ఆర్ముగం విశ్వనాథ్, షమీవుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి పాటుపడండి



మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు (రాజంపేట) : మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారానికి అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, డిప్యూటీ తహసీల్దార్ మోహన్ కృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఎస్. రాజంపేట రెవెన్యూ గ్రామంలో గురువారం వరి చేనులో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించినట్లు బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్. రాజంపేట గ్రామంలోని గంగాధర్ అనే రైతు పొలంలో 5×5 మీటర్లలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించామన్నారు. ఈ ప్రయోగంలో 17.100 కిలోల దిగుబడి నమోదైందని పేర్కొన్నారు. పంట కోత ప్రయోగంలో ఉత్పత్తి, ఉత్పాదకత అంచనాతో పాటు పంటల బీమా మదింపుకు కూడా ఈ దిగుబడి అంచనా ప్రయోగం కీలకమని ఆయన అన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి టి.అశోక్‌కుమార్, రైతు భరోసా కేంద్రం సహాయకులు ప్రేమ్‌కుమార్, రైతు పాల్గొన్నారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని అన్ని మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని 3 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదై, మిగిలిన 27 మండలాల్లో తక్కువ వర్షపాతంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలన్నారు. కాగా ప్రభుత్వం 18 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించని పక్షంలో రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమిస్తామంటూ ఆయన హెచ్చరించారు.

అభివృద్ధికి సోపానాలు సచివాలయాలు

కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఆర్బీకే ప్రారంభోత్సవం అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

గాలివీడు : అభివృద్ధికి సోపానాలు గ్రామ, వార్డు సచివాలయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, జగనన్న పాల వెల్లువ భవనాల సముదాయం, నూలివీడులో రైతు గోడౌన్, పందికుంటలో గ్రామ సచివాలయం, గాలివీడులో రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థ చారిత్రాత్మకంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసా నిస్తున్నాయన్నారు. సచివాలయం అధికారులు, సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేసి సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఆసరా కలుగుతుందని, రైతులకు అన్ని సేవలు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో లభిస్తున్నాయన్నారు. ఇందులో కియోస్క్, టీవీ, లైబ్రరీలు ఉంటాయని, రైతన్నకు కావాల్సిన సమాచారం పొందవచ్చునన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను ఇక్కడి నుండే ఆర్డర్ చేసుకున్న 48 గంటల్లో పొందవచ్చునన్నారు. విత్తన పంపిణీ గ్రామస్థాయిలోనే జరుగుతుందని, పంట సాగు వివరాలు నమోదును రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

గోరాన్‌చెరువు గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నూతన భవనం ప్రారంభంలో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2,500 జనాభాకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 65 రకాల మందులతో పాటు 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంటుందన్నారు. రూ17.57లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ ద్వారా యువత, ఉద్యోగులకు వరంగా డిజిటల్ లైబ్రరీలు మారుతున్నాయన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెంపొందాలి..

ప్రజల్లో భక్తిభావాలు పెంపొందాలని రూ.50లక్షల నిధులతో మండలంలోని పందికుంట గ్రామం వెంకటేశ్వరపురంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణం శిలాఫలకాన్ని ఆవిష్కరణలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని, జగన్‌పాలనలో ఆలయాలకు మహర్దశ కల్పిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, సింగల్‌విండో అధ్యక్షుడు మిట్టపల్లె వేదమూర్తిరెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్‌లు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నల్లాబత్తుని వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నరెడ్డి, సర్పంచ్‌లు డి.దీప్తి, ఎం.లక్ష్మీదేవమ్మ, ఉమాపతిరెడ్డి, ఉమ ప్రభాకర్, ఎంపీటీసీ గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, జానకిరామాంజులురెడ్డి, కామసాని కేశవరెడ్డి, తంగాల వేణుగోపాల్, వెంకటాద్రి, బ్రహ్మానందరెడ్డి, పూలికుంట హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమరనాథరెడ్డి, ఎం.భానుమూర్తిరెడ్డి, కె.శివారెడ్డి, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నగరవనం అభివృద్ధి

రాయచోటి : సందర్శకులను ఆకట్టుకునేలా నగరవనం అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలో 76 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మితమవుతున్న నగరవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్టేట్ సివిల్ సప్‌లెస్ట్ డైరెక్టర్‌లు పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డిలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. నగరవనం నిర్మితమవుతున్న ప్రదేశంలో ఆయన కలియతిరిగారు. కంచె, రహదారి నిర్మాణాల పనులను వారు పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో పెంచి త్వరలోనే ప్రారంభించేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే లక్ష్యాల సాధన

క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'ప్రజాస్వామ్యం విలువలు' అవగాహన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్టేట్ సివిల్ సప్‌లెస్ట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డిలతో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కళాశాలలో మౌలిక వసతులు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన విద్యా బోధనలు అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన జీవనాన్ని సాగించాలన్నారు. మైనారీలలో చాలా మంది విద్యార్థులు అర్ధాంతరంగా వారి చదువులను నిలిపివేస్తున్నారన్నారు. విద్యార్థుల ఆలోచనా విధానాలలో మార్పులు రావాలన్నారు. మహిళలకు అన్ని రంగాలలో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తోంద్నునారు. ఒక తప్పటడుగుతో జీవితమంతా ఇబ్బందులు పడతారన్నారు. గొప్ప ఆలోచనలు, లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. త్వరలో పీజీ కేంద్రాన్ని కూడా రాయచోటిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కళాశాలలో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, నీటి కుళాయిలను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. వీటిని విద్యార్థులు చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలకు 10 సీలింగ్ ఫ్యాన్లను వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ వితరణగా అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హైదర్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి: డిగ్రీ కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రాజంపేట టౌన్ : ధ్యానంతో మనిషి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పిరమిడ్ ధ్యాన ప్రచారకుడు వెలగపూడి లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానిక పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి ప్రజలకు ధ్యానం ఆవశ్యకతను తెలియజేశారు. ఇక్కడి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు వీలును చూసుకొని రోజుకు ఒక గంట అయినా ధ్యానం చేయాలని సూచించారు. అందువల్ల మనిషి మానసిక ఒత్తిడిని అధిగమించి మనసును ప్రశాంతంగా ఉంచుకోగలడని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆంజనేయులునాయుడు, రామచంద్రనాయుడు, టి.రెడ్డయ్య, రాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.

5న ఆకేపాడులో ఆర్థో క్యాంప్

పుల్లంపేట : మండల ప్రజలు ఉచిత మెగా ఆర్థో క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్‌లో ఈనెల 5న 30 మంది వైద్యులతో మెగా ఆర్థో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఎముకలు, కీళ్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్‌లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరి రాజుగారిపల్లి పరిసర ప్రాంతాలలో పేకాట ఆడుతుండగా గురువారం దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతాలలో నాటుసారా స్థావరాలపై తనిఖీలు నిర్వహిస్తుండగా పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరివద్ద నుంచి రూ. 25,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రాయచోటి అర్బన్: విద్యార్థులకు మాత్రలను మింగిస్తున్న వైద్యసిబ్బంది



సంబేపల్లె : విద్యార్థినితో మాత్రలు మింగిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : రక్తహీనత లోపం నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తప్పనిసరిగా మింగాలని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం రూరల్ మండల పరిధిలోని మాధవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని, ప్రతి గురువారం మధ్యాహ్నం భోజనం తర్వాత ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను మింగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పూల వెంకటరమణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ భాస్కర్‌నాయుడు, పీఈటీ జమాల్ బీ, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, వెంకట్రామయ్య, వెంకటరమణ నాయక్‌తో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లె : పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులలో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో రక్తహీనతను నివారించడానికి, వ్యాధి నిరోధకతను మెరుగుపరచడానికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేయడం ద్వారా హిమోగ్లోబిన్ స్థాయిని నిర్ధారించారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఆశ వర్కర్ లక్ష్మీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయచోటి టౌన్ : జిల్లా స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు 13 మంది ఎంపికయ్యారు. వీరి అభినందన కార్యక్రమాన్ని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురువారం డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని వారిని అభినందించారు. టెన్నికాయిట్‌లో ఎస్.శ్రావణి, ఎస్. షామీర్, ఏ.నాగప్రణీత్ రెడ్డి, పి. యాసిన్, కె.అరాఫత్, ఎన్.వెంకట శివ కుమార్, వి.మహేంద్ర, వి.రంజిత్, శ్రీ పూజలు ఎంపికయ్యారు. అలాగే గత నెల 30న ప్రొద్దుటూరు మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో డి. శివరాం, సి.అవినాష్, శ్రీపూజ, ఎస్.రుషీంద్రలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ)లో..

జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో కూడా జిల్లా క్రీడా పోటీలు నిర్వహించగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది బాలికలు, 12 బాలురులు, అండర్ -14 వాలీబాల్ పోటీలకు ఎంపిక నిర్వహించగా వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. వీరు విశాఖపట్నం అరకులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆర్గనైజర్ నరసరాజు తెలిపారు. కడప ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసరాజు, పీడీలు వీరాంజనేయులు, రెడ్డెయ్య, అమరనాథ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, రవీంద్ర రాజు, రమేష్ నాయక్, ఫయాజ్, రామచంద్ర, ఓబులేసు, ప్రదీప్, కలీమ్ బాషాలు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

రాయచోటి అర్బన్ : రాయచోటికి చెందిన హైర్‌బస్ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లె వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై ఉపాధ్యాయుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి - వేంపల్లె రూట్‌లో ప్రయాణించే హైర్ బస్సు 76 మందితో ప్రయాణిస్తుండగా నాగులగుట్టపల్లె వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామ్మోహన్ మరికొందరు బస్సును ఆపారన్నారు. బస్సులో ప్రయాణీకులు ఉండటంతో, మరో బస్సులో రావాలంటూ డ్రైవర్ చెప్పి వెళ్లిపోయాడన్నారు. ఇందుకు ఆగ్రహించిన రామ్మోహన్ మరికొందరితో కలసి కారులో బస్సును వెంబడించి డ్రైవర్ పెదవీటి నరసింహులుపై విచక్షణారహితంగా దాడిచేశాడన్నారు. పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేశారన్నారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు పెట్టాలంటూ డిమాండ్ చేశారు. లేకుంటే ఆర్టీసీ ఉద్యోగులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తామని తెలియజేశారు.

అన్ని జాగ్రత్తలతో టపాసుల దుకాణాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఎస్పీ

రాజంపేట : నిబంధనల మేరకే టపాసుల దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేయాలని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆర్డీఓ సభా భవనంలో రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక, పోలీసుశాఖ, ఏపీఎస్పీడీసీఎల్, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు నిబంధనలు తప్పనసరిగా పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందుస్తు చర్యలు తప్పనిసరి అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 160 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాక అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. దరఖాస్తులను విచారణకు సంబంధితశాఖలకు పంపామన్నారు. రాజంపేట డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ పట్టణ, మండల కేంద్రాలలో ఏర్పాటు చేసుకునే టపాసుల దుకాణాలు అనుమతులు ఇచ్చే విషయంలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జనావాసాలుకు దూరంగా టపాసుల దుకాణాలు ఉండాలన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్!



జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమ కిట్టును ఇస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

నందలూరు (రాజంపేట) : ప్రజలకు చెప్పిన హామీలలో 98శాతం హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. గురువారం నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ షాదీఖానాలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులతో సచివాలయ కన్వీనర్లతో, గృహ సారథులతో జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం మండల పార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచారన్నారు. పాదయాత్రలో చెప్పిన హామీలను గుర్తించుకొని ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వివిధ పథకాల రూపేన రాజంపేట నియోజకవర్గానికి రూ. 1215 కోట్లు నాలుగున్నర సంవత్సరాల కాలంలో లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనుదీప్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, సయ్యద్ అమీర్, సర్పంచ్ సూర్యనారాయణ, గొబ్బిళ్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ ఆంధ్రప్రదేశ్ కావాలంటే మళ్లీ జగన్నే సీఎం చేసుకుందాం

ఒంటిమిట్ట : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండి ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రజా సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఒంటిమిట్టలోని హరితా ఫంక్షన్ హాలులో నిర్వహించిన జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి వారు హాజరయ్యారు. మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలను, వైఎస్సార్‌సీపీ సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అన్ని విషయాలలో ప్రజలకు అండా నిలుస్తున్న జగన్‌ను ముఖ్యమంత్రిగా తిరిగి గెలిచేలా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రతి గడపకు అందినా సంక్షేమంతో పాటు ప్రతిపక్ష పార్టీ విమర్శలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి, దున్నూతల రఘురాంరెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

రాజంపేట : నియోజకవర్గ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే స్వీకరించడం జరుగుతుందని అదనపు ఎన్నికల నమోదు అధికారి ఎంపీఎస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4, 5, వచ్చే నెల 2, 3 వ తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు క్లెయిము, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. సంబంధిత బీఎల్‌వోలు పోలింగ్‌స్టేషన్ డ్రాఫ్ట్ ఓటరు జాబితాతో క్లెయిమ్, అభ్యంతరాల స్వీకరణ కోసం హాజరవుతారన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులు లిఖితపూర్వకంగా బూత్‌స్థాయి అధికారికి ఇవ్వాలన్నారు..

రాజంపేట రూరల్ సీఐగా మంజునాథరెడ్డి



రాజంపేట : రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మంజునాథరెడ్డి నియమితులయ్యారు. గురువారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈయనను సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్‌ఐలు కలిసి అభినందనలు తెలియజేశారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న పుల్లయ్యను టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు.

పాల దిగుబడిని పెంపొందించుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారిణి లక్ష్మీదేవి

సిద్దవటం : పాడి రైతులు పాల దిగుబడిని పెంపొందించుకోవాలని సిద్దవటం పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరెక్టర్ కె.లక్ష్మీదేవి తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి పశు వైద్యశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాడి రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం టక్కోలులో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించి పాడి రైతులకు పాల దిగుబడిపై మెళుకువలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంటు డైరెక్టర్ మాట్లాడుతూ పశువులు ఎదకు వచ్చినప్పుడు ఎలా గుర్తించాలో తెలియజేశారు. వ్యాక్సినేషన్, దూడలకు నట్టల నివారణపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. త్వరలో ప్రభుత్వం పశు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించే యోచనలో ఉందని, పాడి పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో మాచుపల్లి పశు వైద్యధికారిణి శ్వేత, పశువైద్య సహాయకురాలు ఉమ, పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

రాజంపేట రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో పేద ప్రజల కోసం విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో వేలాది మందికి ఉచిత వైద్యం అందజేయడం నభూతో నభవిష్యత్ అని కొనియాడారు. ఈ నెల 5వ తేదీన ఆకేపాటి ఎస్టేట్‌లో ఉచిత మెగా ఆర్థో వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. శిబిరంలో 30 మంది ఆర్థో వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో డివిజన్ పరిధిలో ఎముకలకు సంబంధించిన వ్యాధితో బాధపడేవాళ్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజంపేట ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు, భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, అరిగెల సౌమిత్రి, దండు గోపి, దాసరి పెంచలయ్య, ఎస్ జావీద్‌అలీ, రేనాటి రాఘవేంద్రవర్మ, సోంబత్తిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ప్రజల ఆరోగ్యం పట్ల వైఎస్సార్‌సీపీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం - 5 పరిధిలోని రంగనాయకులపేట, శ్రీరాంనగర్, చింతనగర్‌లోని ప్రజలకు సాయిడిగ్రీ కళాశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఎటువంటి ఖర్చులు లేకుండా ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. మొన్నటి వరకూ ఏదైనా జబ్బు వస్తే మండల కేంద్రానికి వచ్చి వైద్యం చేయించుకునే వారని, నిన్న ఊళ్ళోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుచేసి వైద్యం అందించేవారని, నేడు ఇంటింటికి తిరిగి జల్లెడ పట్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, భరత్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ రమేష్, ఎంపీటీసీ ఆంజనేయులు, రౌఫ్, రత్తయ్య, ఈవీపీఆర్డీ నాగార్జున, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి సంకల్ప' పాడి రైతులకు మేలు చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : ప్రధాన మంత్రి ఉపాధి సంకల్ప పథకం నియోజకవర్గంలోని పాడి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిలతో కలిసి కొరముట్ల అధికారులతో సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలో ఎక్కువమంది పాడి రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో రైతుకు లక్ష రూపాయలు 35 శాతం రాయితీతో బ్యాంకులు ద్వారా రుణాలు ఇస్తారని, అలాగే పాడి రైతులు అభివృద్ధి చెందడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకాన్ని ఎక్కువ మంది రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.